# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 14-10-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది.

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మరికాసేపట్లో విజయవాడ నగరానికి రానున్నారు.

- నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు నవంబర్ 3వ తేదీలోగా డీఎస్సీ-2026 పూర్తిస్థాయి నోటిఫికేషన్ ను విడుదల చేస్తామని విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ తెలిపారు.

- విజయనగరం జిల్లా తాగు, సాగు నీటి అవసరాల నిమిత్తం 22 కోట్ల 14 లక్షల రూపాయలతో చెరువుల పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు ఉప ముఖ్యమంత్రి కే. పవన్ కళ్యాణ్ ఆమోదం తెలిపారు.

====================

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ విడుదలయింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఈరోజు నుంచే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ప్రకటించారు. 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీలకు ఈ నెల 28 వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నామని 30న ఓట్ల లెక్కింపు చేపడతామని తెలిపారు. ఈ నెల 18 వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చని 19న నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణకు ఈ నెల 21వరకు గడువు ఉందని అమరావతిలో ఈరోజు జరిగిన పాత్రికేయుల ఆయన సమావేశంలో వెల్లడించారు. నవంబరు 3న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించనున్నామని దీనికి సంబంధించి ఈ నెల 19న నోటిఫికేషన్ విడుదల కానుందని చెప్పారు. నామినేషన్ల దాఖలుకు తుదిగడువు ఈ నెల 23 కాగా, ఉపసంహరణకు ఈ నెల 27వరకు గడువు ఉందని, నవంబరు 5న ఫలితాలు వెల్లడించనున్నామని చెప్పారు. పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నామని, నవంబర్ 26న మొదటి విడత, 29న రెండో విడత, డిసెంబర్ 2న మూడో విడత జరగనున్నాయని చెప్పారు. పంచాయితీలకు ఎన్నికలు జరిగిన రోజునే ఓట్ల లెక్కింపు ఉంటుందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వివరిస్తూ...

(వాయిస్...32 సెకన్లు)

====================

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మరికాసేపట్లో విజయవాడకు రానున్నారు. రెండు రోజుల పాటు నగరంలో పర్యటించనున్న రాష్ట్రపతి ఈ సాయంత్రం ఇంద్రకీలాద్రిపై కొలువు దీరిన శ్రీ కనకదుర్గమ్మ వారిని దర్శించుకోనున్నారు. ఇక రేపు జాతీయ సరస్ ఆజీవికా మేళ - 2026 ను ప్రారంభించనున్నారు. కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ స్థానిక ఎంపీ కేసినేని శివనాథ్ తో కలిసి ఈరోజు పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన వివిధ ఉత్పత్తులు, ఆహార వంటకాలను ఈ సరస్ మేళాలో ప్రజలకు

అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ మేళా ద్వారా ఆంధ్రప్రదేశ్ కు చెందిన డ్వాక్రా మహిళలకు అత్యంత ప్రాధాన్యత కల్పించేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు.

====================

నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు 2 వేల 721 ఉపాధ్యాయ పోస్టులతో డీఎస్సీ-2026 ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసినట్లు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. అర్హతలు, వయోపరిమితి, దరఖాస్తు తుది గడువు, పరీక్ష తేదీ మొదలగు వివరాలతో కూడిన పూర్తిస్థాయి నోటిఫికేషన్ ను నవంబర్ 3 లోగా విడుదల చేస్తామన్నారు. దరఖాస్తుల స్వీకరణ ఆన్‌లైన్ ద్వారానే ఉంటుందని, పరీక్షను కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహిస్తామని తెలిపారు. కాగా మొత్తం 2 వేల 721 పోస్టుల్లో జనరల్ స్కూల్స్ కి సంబంధించి 2 వేల 111 పోస్టులు, స్పెషల్ ఎడ్యుకేషన్ కు సంబంధించి 350 పోస్టులు, గురుకుల సొసైటీలకు సంబంధించి 260 పోస్టులు ఉన్నాయి.

====================

విజయనగరం జిల్లా తాగు, సాగు నీటి అవసరాలు నిమిత్తం పంచాయతీరాజ్ శాఖ నుంచి 22 కోట్ల 14 లక్షల రూపాయలతో చెరువుల పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆమోదం తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి వి బి జి రామ్ జి పథకం (VB-G RAM G)లో భాగంగా మెటీరియల్ కాంపోనెంట్ నిధులు 205 కోట్ల 69 లక్షల రూపాయలు జిల్లాకు అందుబాటులో ఉన్న నేపథ్యంలో వాటిని ఉపయోగించి జిల్లాలో మొత్తం 454 చెరువులకు జీవం పోయనున్నారు. చెరువుల్లో పూడిక తొలగించి, పునరుద్ధరణ చేయడంతోపాటు నీరు సరఫరా అయ్యే కాలువలు పునరుద్ధరణ, స్లూయిస్ గేట్లకు మరమ్మతులు  చేయనున్నారు. 454 చెరువులకు సరికొత్త కళ తెచ్చేలా ఈ పనులు వెంటనే ప్రారంభించాలని పవన్ కళ్యాణ్ అధికారులకు స్పష్టం చేశారు.

====================

విరామం

====================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇరవై అయిదేళ్ల ప్రజాసేవ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రాంతీయ వార్తా విభాగం `జన్ సేవా సే దేశ్ సేవ` పేరిట ప్రత్యేక కథనాలను అందిస్తోంది. అందులో భాగంగా 2025 వక్ఫ్ సవరణలు గురించి ఇప్పుడు తెలుసుకుందాం..!

దేశంలో వక్ఫ్ ఆస్తుల నిర్వహణ, నమోదు ప్రక్రియలో పారదర్శకతను పెంపొందించడం, ఆస్తుల వివరాలను డిజిటలైజ్ చేయడం, వాటి దుర్వినియోగాన్ని నిరోధించడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టం - 2025ను తీసుకొచ్చింది. ఈ చట్టం ద్వారా 1995 నాటి వక్ఫ్ చట్టానికి పలు సవరణలు చేసింది. వక్ఫ్ ఆస్తుల నిర్వహణ వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడంతోపాటు, వాటి పరిపాలనలో జవాబుదారీతనాన్ని పెంచేందుకు కొత్త నిబంధనలను ప్రవేశపెట్టింది. వక్ఫ్ సవరణ చట్టం ప్రకారం, వక్ఫ్ ఆస్తుల వివరాలను నిర్ణీత గడువులోగా ప్రత్యేక డిజిటల్ పోర్టల్‌లో నమోదు చేయడం, ఆస్తుల యాజమాన్యం, నిర్వహణకు సంబంధించిన సమాచారాన్ని అందుబాటులో ఉంచడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఇప్పటికే నమోదైన వక్ఫ్ ఆస్తుల వివరాలను కూడా పోర్టల్‌లో సమర్పించాలని చట్టం నిర్దేశించింది. ఈ వివరాల నమోదు కోసం యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్, ఎంపవర్‌మెంట్, ఎఫిషియెన్సీ అండ్ డెవలప్‌మెంట్ - యూమీడ్ (UMEED) పోర్టల్‌ను ఏర్పాటు చేశారు. ముస్లిం సమాజం నుండి ముఖ్యంగా మహిళలు, వితంతువులు, పస్మందా ముస్లింల నుండి వచ్చిన 1,700కి పైగా ఫిర్యాదులు, వినతుల ఆధారంగానే ఈ సంస్కరణలు చేపట్టామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఒక సందర్భంలో పేర్కొంటూ...

(వాయిస్...29 సెకన్లు)

====================

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ఈరోజు పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ, సాలూరు నియోజకవర్గంలో 110 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి మండలానికి 20 కోట్ల రూపాయలు, సాలూరు పట్టణానికి 30 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన పనులను పూర్తి చేసి ప్రారంభోత్సవాలు నిర్వహించే దిశగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. సాలూరు నియోజకవర్గానికి వెయ్యి గోకులాలు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు.

====================

తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. టైమ్ స్లాట్ టోకెన్లు లేని భక్తులకు స్వామి వారి సర్వదర్శనానికి దాదాపు 8 గంటల సమయం పడుతోంది. నిన్న స్వామివారిని 84 వేల 179 మంది భక్తులు దర్శించుకోగా, 29 వేల 644 మంది తలనీలాలు సమర్పించారు. శ్రీవారి హుండీ ఆదాయం 3 కోట్ల లక్ష రూపాయలుగా నమోదైంది. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ ఉదయం శ్రీ మలయప్పస్వామి 'సింహ వాహనం'పై భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 7 గంటలకు 'ముత్యపు పందిరి వాహనం'పై స్వామివారు తిరుమాడ వీధుల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

=====================

ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఈ నెల 19నుండి 23 వరకు గుంటూరు నాగార్జున విశ్వ విద్యాలయంలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను నిర్వహించనున్నట్టు విజయవాడ ఎపిఎస్పిఎఫ్ కమాండెంట్ ముద్దాడ శంకరరావు తెలియ జేశారు. 35వ ఎపిఎస్పిఎఫ్ స్పోర్ట్స్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల 19నుండి 23 వరకు జరగనున్న ఈ క్రీడా పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ విభాగాలలో పని చేస్తున్న క్రీడాకారులు క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, 100 మీటర్ల పరుగు, 400 మీటర్ల పరుగు, 5 కి.మీ పరుగు, హై జంప్, లాంగ్ జంప్, షాట్ పుట్ వంటి పోటీల్లో పాల్గొనున్నారని శంకరరావు తెలిపారు.

=====================

విశాఖపట్నంలో 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు నవంబరు 12, 13 తేదీలలో జరగనుంది. దీనికి సన్నాహకంగా రాష్ట్ర వ్యాప్తంగా 5 ప్రాంతీయ సదస్సుల నిర్వహణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా ఇప్పటికే అక్టోబరు 7వ తేదీన విశాఖపట్నంలో, 12న కాకినాడలో రెండు సదస్సులు విజయవంతంగా పూర్తయ్యాయి. మిగిలిన 3 ప్రాంతీయ సదస్సులను అక్టోబరు 16వ తేదీన అమరావతిలో, అక్టోబరు 23వ తేదీన అనంతపురంలో, 26న తిరుపతిలో ప్రభుత్వం నిర్వహించనుంది.

=====================
=====================